మేమున్నామంటూ భరోసా

- అన్నదాత పోరు సక్సెస్
- వేలాదిగా నెల్లూరుకు తరలిన కార్యకర్తలు
- పోలీస్ ఆంక్షల్ని అధిగమించి వెళ్లిన నాయకులు



సర్వేపల్లి, కోవూరు నుంచి నెల్లూరుకు తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు

పొదలకూరు: వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు అన్నదాత పోరును నాయకులు, కార్యకర్తలు విజయవంతంగా నిర్వహించారు. మాజీ మంత్రి, ఆ పార్టీ సర్వేపల్లి సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 107 పంచాయతీల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు కదం తొక్కారు. స్వచ్ఛందంగా తమ నిరసను వ్యక్తం చేసేందుకు మంగళవారం నెల్లూరు నగరంలోని వీఆర్సీ సెంటర్‌కు చేరుకున్నారు. అధిక సంఖ్యలో రైతులు నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు తరలివెళ్లారు. కొద్దిరోజులుగా వ్యవసాయ రంగం కదేలై కనీసం యూరియా బస్తా కూడా లభ్యం కాని పరిస్థితుల్లో పార్టీ పిలుపు మేరకు కార్యకర్తలు రైతులకు అండగా నిలిచారు. ప్రతి గ్రామం నుంచి వెళ్లి కూటమి ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు.

అడ్డుకునేందుకు..

అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు వెళ్లకుండా నిలువరించేందుకు కూటమి ప్రభుత్వం చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. పోలీస్ ఆంక్షల పేరుతో దారిలో బారికేడ్లను ఏర్పాటు చేసి కార్లు, ఆటోల్లో వెళుతున్న వారిని వారించారు. అయితే చాలామంది కార్యకర్తలు, నాయకులు ద్విచక్ర వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో నెల్లూరు నగరం చేరుకున్నారు. వెంకటాచలం మండలం చెముడుగుంట హైవేపై పోలీసులు బారికేడ్లను పెట్టి అడ్డగించారు. పొదలకూరు మండలానికి చెందిన కార్యకర్తలను నెల్లూరు మార్గంలోని ఆమంచర్ల వద్ద ఉదయాన్నే నిలువరించిన పోలీసులు తర్వాత మిన్నకుండిపోయారు. అయితే నియోజకవర్గంలో నాయకులకు నోటీసులిచ్చిన దాఖలాల్లేవు. పోలీసులు ఫోన్లు చేసి నిరసన కార్యక్రమాన్ని వెళితే ఇబ్బంది పడతారని కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరించినట్టు కొందరు నేతలు వెల్లడించారు. నాయకులు పెద్ద ఎత్తున వాహనాలు ఏర్పాటు చేసి తరలించకపోవడంతో పోలీసులు సైతం అడ్డంకులు సృష్టించేందుకు వీలు కాలేదు. స్వచ్ఛందంగా అందుబాటులో ఉన్న సొంత వాహనాల్లో తరలివెళ్లారు.



చెముడుగుంట హైవేపై బారికేడ్లను ఏర్పాటు చేసిన పోలీసులు

సూపర్ సక్సెస్

కోవూరు: రైతుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు విజయవంతమైంది. నెల్లూరులోని కలెక్టరేట్ వరకు చేపట్టిన ర్యాలీకి కోవూరు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, రైతులు విశేషంగా తరలి వచ్చారు. పార్టీ యువజన విభాగ కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో వేలాది మంది కార్యకర్తలు, రైతులు, అభిమానులు బస్సులు, వాహనాలు, బైకులు, ఆటోల్లో బయల్దేరారు. నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీ నుంచి స్వచ్ఛందంగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా రజత్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.



పార్టీ శ్రేణులతో రజత్‌కుమార్‌రెడ్డి

మర్యాదపూర్వకంగా..





కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో పార్టీ ఐటీ విభాగ జిల్లా ఉపాధ్యక్షుడు రాతికోట రవిచంద్ర, పార్టీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి బాలకృష్ణ మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలను తెలియజేశారు. పార్టీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, రియాజ్, అరుణ్, శరత్‌బాబు, సలీమ్, పార్టీ కోవూరు మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, న్యాయవాదులు శ్యామాచార్యులు, చెంచురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నరసింహారావు, మల్లికార్జున, చందు, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధన మహోత్సవాలు

తోటపల్లిగూడూరు: కోడూరు సాగరతీరం వేళాంగణిమాత భక్తులతో సందడిగా మారింది. ఆరాధన మహోత్సవాలు ఈనెల 6 నుంచి జరుగుతున్న విషయం తెలిసిందే. సోమవారం రాత్రి దివ్యబలిపూజ, తేరు ప్రదక్షిణ కార్యక్రమాలు వేడుకగా జరిగాయి. భక్తులు పుణ్యక్షేత్రం ఆవరణలో జాగారం చేశారు. మంగళవారం వేకువజాము నుంచి సాగర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎస్సై వీరేంద్రబాబు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.



కోడూరు తీరంలో సందడి

15లోపు స్వామిత్వ సర్వే పూర్తి



మాట్లాడుతున్న మహేశ్వరి



హాజరైన పంచాయతీ కార్యదర్శులు తదితరులు

కొడవలూరు: స్వామిత్వ సర్వేను ఈ నెల 15లోపు పూర్తి చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి సూచించారు. స్వామిత్వ సర్వేపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సర్వేను అత్యంత పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఇంటి నిర్మాణం ఎంత విస్తీర్ణంలో ఉంది.. ఎవరు నివసిస్తున్నారు.. వారి ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలమెంత తదితరాలను పక్కాగా నమోదు చేయాలని కోరారు. సర్వే భవిష్యత్తులో ఎంతో కీలకంగా మారనుందని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు శ్యామ్‌సుందర్, బ్రహ్మానందరెడ్డి, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో మంజూరు చేయండి

నెల్లూరు(పొగతోట): స్వయం సహాయక గ్రూపు మహిళలు, వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు రుణాలను సకాలంలో మంజూరు చేయాలని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి కోరారు. నగరంలోని డీఆర్డీఏ కార్యాలయంలో బ్యాంక్ అధికారులతో మంగళవారం ఆమె మాట్లాడారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి రుణాలను సకాలంలో మంజూరు చేయాలన్నారు. వివిధ రకాల యూనిట్ల ఏర్పాటుకు రుణాలను అందించాలని పేర్కొన్నారు.

➡ బ్యాంకుల ద్వారా స్వయం సహాయక గ్రూపు మహిళలు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించేలా ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి ఆదేశించారు. నగరంలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సమాఖ్య కార్యనిర్వహణ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా చూడాలని సూచించారు. డీపీఎం మురళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగరాజకుమారి

ఉపాధ్యాయుడికి అభినందన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కవితల పోటీల్లో ఆయన ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు.

వీరాంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలను నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, ఆకుపూజ, అష్టోత్తర పూజలు చేశారు.

ఘనంగా గిడుగు రామమూర్తి జయంతి



వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

వెంకటాచలం: మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో మంగళవారం గిడుగు రామమూర్తి, కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్ కుమార్, ఆచార్య ఆర్వీఎస్ సుందరం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానం



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని బాలభవన్, నెల్లూరు డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 21 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలను అందజేశారు. కేంద్ర బాలసాహిత్య పురస్కార గ్రహీత గంగిశెట్టి శివకుమార్, తడ ఎంఈఓ కొండ్రాజు మల్లికార్జునరావు నరసింహరావు, శ్రీనివాసులురెడ్డి, ఉస్మాన్‌బాషా, కోటేశ్వరరావు, జగన్నాథం రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో తనిఖీలు



నెల్లూరు(అర్బన్): వేదాయపాళెంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ మంగళవారం తనిఖీ చేశారు. డెంగీ, చికున్‌గన్యా, మలేరియా, ఫైలేరియా లాంటి వ్యాధులకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. పరీక్షలను ల్యాబ్ టెక్నీషియన్లు పక్కాగా చేపట్టాలని సూచించారు. పాజిటివ్ వచ్చిన స్లయిడ్లను డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి చేర్చాలని కోరారు. అనంతరం సమీప ప్రాంతాల్లో నిర్వహిస్తున్న లార్వా సర్వేను పరిశీలించారు. బాలికల హాస్టల్‌ను సందర్శించి.. అక్కడి వాష్‌రూమ్‌ల వద్ద మురుగును తొలగించడంతో పాటు కిటికీలకు మెష్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.

సమర్థంగా సహకార సంఘాల నిర్వహణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సహకార సంఘాలను సమర్థంగా నిర్వహించాలని డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని సహకార సంఘాల అధ్యక్షులకు అవగాహన కార్యక్రమాన్ని గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని జిల్లా సహకార బ్యాంక్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సహకార చట్టాలను అనుసరించి విధులు నిర్వర్తించి సంఘాల అభివృద్ధికి దోహదపడాలని కోరారు. డీసీఓ గుర్రప్ప, డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు, డీసీఏఓ తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాలో జాగ్రత్తలు పాటించండి



మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుక, మట్టి తదితరాల రవాణా సమయంలో నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని కమిషనర్ నందన్ సూచించారు. పొట్టేపాళెంలోని రీచ్ నుంచి నగరంలోకి ఇసుకను రవాణా చేస్తున్న ఎడ్ల బండ్లను ఆపి వాటి యజమానులతో మంగళవారం ఆయన మాట్లాడారు. రోడ్లపై ఇసుక పడకుండా బండి చుట్టూ చెక్కలు, పట్టను ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలను పాటించకపోతే జరిమానాలను విధిస్తామని చెప్పారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా అందిన ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గానూ 17వ డివిజన్లోని అయోధ్యనగర్‌లో పర్యటించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి.. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిందిగా పట్టణ ప్రణాళిక విభాగాధికారులను ఆదేశించారు.

➡ కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ విభాగంతో సమీక్ష సమావేశాన్ని కమిషనర్ నందన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సేవా అభ్యర్థనలను నిర్దేశిత సమయంలోపు పూర్తి చేయాలని సూచించారు. నూతనంగా నిర్మించిన భవనాలు, ఖాళీ స్థలాలను గుర్తించి ట్యాక్స్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. లోక్ అదాలత్ నోటీసులు అందుకున్న వారందరూ శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కోర్టు ప్రాంగణంలో ప్రత్యేక చెల్లింపు కౌంటర్లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులో 15 షాపులకు అద్దెలను చెల్లించని కారణంగా వాటిని సీజ్ చేసి.. యజమానుల నుంచి రూ.58 లక్షలను వసూలు చేసిన ఆర్‌ఐ కిరణ్‌తో పాటు పలువుర్ని అభినందించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆర్‌ఐలు శ్రీనివాసులు, సమద్, మేనేజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్

మనుబోలు: బస్సు ప్రయాణమే సురక్షితమంటూ ఆర్టీసీ తరచూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తుంది. అయితే ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాల విషయంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. బస్సులు ఆగే చోట షెల్టర్లు ఉండవు. అవసరం లేనిచోట మాత్రం నిర్మిస్తారు. మనుబోలు కోదండరామపురం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న బస్ షెల్టర్ నిరుపయోగంగా ఉంది. బస్సులు ఆగే మెయిన్ సెంటర్‌ను వదిలేసి బైపాస్ రోడ్డు పక్కన నున్న సర్వీస్ రోడ్డు వద్ద గతంలో నిర్మించారు. ఇక్కడ బస్సులు ఆగే వెసులుబాటు లేకపోవడంతో వృథాగా మారింది. దీనికితోడు గ్రామానికి దూరంగా ఉండటంతో ఒక్కరు కూడా వెళ్లడం లేదు. కోదండరామపురంలో బస్సులు ఆగే రెండు చోట్ల షెల్టర్‌లు లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీని గురించి ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.



చెత్తాచెదారంతో నిండిన బస్ షెల్టర్



ఎండలో వేచి ఉన్న విద్యార్థులు

విద్యార్థులకు ఎన్నో ఉపయోగాలు

- వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం: భారతీయ జ్ఞాన వ్యవస్థను విద్యారంగంతో సమన్వయం చేయడం ద్వారా విద్యార్థులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని విక్రమసింహపురి యూనివర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు అన్నారు. జాతీయ విద్యా విధానం ప్రోగ్రాంలో భాగంగా రెండో రోజు మంగళవారం వర్సిటీలో భారతీయ జ్ఞాన వ్యవస్థను విద్యారంగంలో సమన్వయంపై ప్యానల్ చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారతీయ జ్ఞాన వ్యవస్థ అనేది వేదాలు, ఉపనిషత్తులు, ఆయుర్వేదం, యోగం, గణితం, ఖగోళం వంటి శాస్త్రాల సమాహారమని, ఇవి దేశ మేధో సంపదకు పునాది అన్నారు. జాతీయ విద్యా విధానం ద్వారా ఈ జ్ఞానాన్ని పాఠ్యాంశాల్లో చేర్చడం వల్ల విద్యార్థుల్లో పరిశోధన దృక్పథం పెరుగుతుందన్నారు. వారిలో సమగ్రతను, సాంస్కృతిక అవగాహనను పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఆచార్య రమేష్‌బాబు, డాక్టర్ సుజా ఎస్. నాయర్, డాక్టర్ మధుమతి, డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

కౌన్సిల్ అత్యవసర సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. చైర్‌పర్సన్ సుప్రజ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మూడు అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పట్టణంలోని ముంబై రోడ్డుకు ఇరువైపులా 3.5 కిలోమీటర్ల మేర డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు.. పూడిక తీసే పనులకు సంబంధించి రూ.పది లక్షలను సాధారణ నిధుల నుంచి వెచ్చించేందుకు ఆమోదం లభించింది. అనంతరం కమిషనర్ బాలకృష్ణ మాట్లాడారు. ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు.



ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ఆక్రమణలను తొలగించాలని 16వ వార్డు కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ పేర్కొన్నారు.

పేదల కోసం బీమా పథకాలు

పొదలకూరు: పేదల కోసం కేంద్ర ప్రభుత్వం బీమా పథకాలు ప్రవేశపెట్టిందని కెనరా బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక కల్యాణ మండపంలో మంగళవారం పొదుపు సంఘాల మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి విచ్చేసిన సీజీఎం మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు బుచ్చిరెడ్డిపాళెం, ముత్తుకూరు, రాపూరు, పొదలకూరు తదితర ప్రాంతాల్లో సదస్సులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనకు రూ.20, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజనకు రూ.286 ప్రీమియం చెల్లిస్తే సరిపోతుందన్నారు. అటల్ పింఛన్ పథకానికి 60 ఏళ్ల వరకు ప్రీమియం చెల్లిస్తే తర్వాత పింఛన్ అందజేయడం జరుగుతుందన్నారు. పొదుపు సంఘాల మహిళలు ఇలాంటి పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిందిగా కోరారు. సదస్సులో ఏజీఎం నాగరాజు, ఎల్‌డీఎం మణిశేఖర్, బీఎం సాయిరాం, వెలుగు ఏపీఎం చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

అధిక మోతాదులో ఎరువులను వాడొద్దు

కొడవలూరు: అధిక మోతాదులో ఎరువుల వినియోగం అనర్థాలకు దారితీస్తుందని కోవూరు ఏడీఏ అనిత పేర్కొన్నారు. మండలంలోని గండవరం, గౌతమ్‌నగర్‌లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అధిక మోతాదులో యూరియా వాడితే పెట్టుబడి పెరగడమే కాకుండా చీడపీడలు ఆశిస్తాయన్నారు. నేల, నీరు, వాతావరణం కలుషితమై మనుషులకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పచ్చి రొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర, నవధాన్యాలను సాగు చేయాలని సూచించారు. ఏఓ విజయలక్ష్మి, వీఏఏలు సుజిత్, కామాక్షి కర్తవ్య తదితరులు పాల్గొన్నారు.

➡ **ఇందుకూరుపేట:** మండలంలోని రావూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రఘునాథ్‌రెడ్డి మాట్లాడారు. నానో యూరియా వినియోగం, ప్రయోజనాలు, పంటల నమోదు, రైతు సంక్షేమ పథకాలపై వివరించారు. మండలంలోని ప్రతి రైతు ఈ - క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. నరహరి తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: గౌతమ్‌నగర్‌లో..

➡ **కోవూరు:** మండలంలోని చెర్లోపాళెంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు అనిత మాట్లాడారు. అధిక యూరియా వినియోగంతో పంటల్లో ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. ఏఓ రజని, మెహరున్నీసా పాల్గొన్నారు.

➡ **మనుబోలు:** అధిక మోతాదులో యూరియా వాడొద్దని వ్యవసాయాధికారి ఏడీఏ శివనాయక్ సూచించారు. మనుబోలు మండల కేంద్రంలోని ఆర్‌బీకేలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూసారాన్ని పెంపొందించుకునేందుకు నవధాన్యాలను పొలంలో చల్లాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వెంకటకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



కోవూరు: చెర్లోపాళెంలో..



మనుబోలు : మాట్లాడుతున్న ఏడీఏ

ఉత్సాహంగా మారథాన్

నెల్లూరు(అర్బన్): హెచ్‌ఐవీ, ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఏసీ స్టేడియంలో ఐదు కిలోమీటర్ల మారథాన్‌ను వైద్య, ఆరోగ్య శాఖ, స్పోర్ట్స్ అథారిటీ, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పోటీలకు 17 నుంచి 25 ఏళ్లలోపు యువతీ, యువకులు, ట్రాన్స్‌జెండర్ విద్యార్థులు వేర్వేరుగా హాజరయ్యారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం డీఎంహెచ్‌ఓ సుజాత మాట్లాడారు. మంచి సమాజం కోసం యువత పాటుపడాలని కోరారు. నైతిక విలువలను పాటించాలని సూచించారు. అనంతరం పరుగుపందెంలో విజేతలకు బహుమతులు, ప్రశంసపత్రాలను అందజేశారు. ఎయిడ్స్ నివారణ జిల్లా అధికారి ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను అందుకున్న విద్యార్థులు